క్లుప్తంగా

పరిహారం చెక్కులు అందజేత



పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లిలో విద్యుత్ ప్రమాదంలో పశువులు మరణించిన యజమానులకు ప్రభుత్వం నుంచి మంజూరైన పరిహారం చెక్కులను మంగళవారం గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ భాస్కర్‌యాదవ్ అందజేశారు. ఆరు నెలల క్రితం గ్రామానికి చెందిన పికిలి చంద్రకళకు సంబంధించిన 6 గొర్రెలు చనిపోతే రూ.42 వేలు, ఎనుముల బాలయ్య గేదె చనిపోతే రూ.40 వేలు, జుట్టుకూరి కుర్మయ్య ఆవు చనిపోతే రూ.40 వేల పరిహారం చెక్కులను పశువుల యజమానులకు అందజేశారు.

శిథిలావస్థలో విద్యుత్ స్తంభం



అమరచింత: పట్టణంలోని సంతోష్‌నగర్‌లో ఇనుప విద్యుత్ స్తంభం ఎప్పుడు కూలుతుందోనన్న భయాందోళనలు నెలకొన్నాయి. మూడు నెలల కిందట విద్యుత్ తీగలు తెగి పడటంతో ఒరిగిన ఇనుప స్తంభం తొలగించి సిమెంట్ స్తంభం ఏర్పాటు చేయారు. కానీ ఇప్పటి వరకు పాతిన సిమెంట్ స్తంభానికి విద్యుత్ వైర్లు బిగించకపోవడంతో ప్రమాదం ఎప్పుడు ఎలా వస్తుందోనని కాలనీవాసులు తెలిపారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు, మున్సిపాలిటీ అధికారులు స్పందించి విరిగి పోవటానికి సిద్ధంగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాన్ని తొలగించి సిమెంటు స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

‘అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి’



మదనాపురం: మండలంలోని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం కలెక్టర్ ఆదర్శ సురభికి మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్ వినతిపత్రం సమర్పించారు. అకాల వర్షాల కారణంగా వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని, వేగంగా కాంటా చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు మిల్లుల్లో అన్‌లోడింగ్ సమస్య కారణంగా లారీలతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బిట్ల యాదగిరి, మండల యూత్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్, దుప్పల్లి మాజీ సర్పంచ్ శివశంకర్, మాసన్న, గడ్డమీది రవికుమార్ తదితరులు ఉన్నారు.

పౌరాణిక కళాకారులను ఆదుకోవాలి



చిన్నంబావి: రాష్ట్రంలోని పౌరాణిక రంగస్థల కళాకారులను ఆదుకోవాలని పౌరాణిక సంఘం జిల్లా అధ్యక్షుడు మహేష్ కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పౌరాణిక కళాకారుల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రంగస్థల కళాకారులకు ప్రభుత్వం అండగా ఉండాలని, ఆ కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. అర్హులైన కళాకారులకు ప్రభుత్వం పింఛన్, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండు చేశారు. మంత్రి జూపల్లి కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పద్మగౌడ్, వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, వెంకటయ్య, కృష్ణారెడ్డి, కాంతారెడ్డి, పూజారి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తేమ శాతాన్ని, రికార్డులను పరిశీలించారు. ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని ఆయన నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల కోసం తాగునీరు, నీడ కోసం టెంట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

అన్నదాతపై హమాలీ భారం

- ఏటా తప్పని అదనపు ఖర్చు
- స్పష్టత ఇవ్వాలంటున్న రైతులు
- స్పందించని అధికారులు



పాన్‌గల్‌లో ధాన్యం కాంటా చేస్తున్న హమాలీలు (ఫైల్)



పాన్‌గల్‌లో కాంటా చేసిన ధాన్యాన్ని లారీకి ఎత్తుతున్న హమాలీలు (ఫైల్)

పాన్‌గల్: మండల వ్యాప్తంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా.. క్వింటాల్‌కు హమాలీ ఎంత చెల్లించాలనే దానిపై రైతులకు ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ధాన్యం సంచుల్లో నింపి లోడింగ్ చేయడానికి హమాలీలు ఒక్కో దగ్గర ఒక్కోలా తీసుకుంటున్నారు. ఎక్కువ మేర క్వింటాల్‌కు రూ. 45 నుంచి రూ.50 వరకు డిమాండ్ చేస్తున్నారు. గతంలో హమాలీలకు రైతు డబ్బులు చెల్లిస్తే తర్వాత వారి ఖాతాకు జమ చేస్తామని గత ప్రభుత్వం చెబుతూ వచ్చింది. కానీ ఇప్పటి వరకు ఏ రైతుకూ ఒక్క రూపాయి జమ చేసిన దాఖలాలు లేవు. రైతులే భరించాల్సి వచ్చింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇస్తుందా లేదా లేక పాత ఒరవడినే కొనసాగిస్తుందా అన్నదానిపై ఎలాంటి స్పష్టత రాలేదు. దీంతో ఈసారి సైతం తామే భరించుకోవాల్సిందేనని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఈసారి ఎక్కువ శాతం కేంద్రాల్లోనే..

మండల వ్యాప్తంగా 19,757 మంది రైతులు 16,800 ఎకరాల్లో వరి సాగు చేయగా 45వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. దిగుబడి దృష్ట్యా రైతులపై రూ.2.25 కోట్ల భారం పడే అవకాశం ఉంది. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సన్నాలు ఎక్కువగా సాగు చేసేవారు. ఈ సాగును ఇంకా పెంచేందుకు ప్రభుత్వం బోనస్ ప్రకటించింది. ఈ సారి ఎక్కువ శాతం రైతులు ప్రైవేటు వ్యక్తులకు కాకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే అవకాశం ఉంది. ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తే కొనుగోలుదారులే హమాలీ, సుతిళ్ల ఖర్చులు భరిస్తారు. కొనుగోలు కేంద్రాల్లో అయితే రైతులకు తప్పడం లేదు.

రైతులపై భారం తగ్గించాలి



హమాలీ చార్జీలు రైతులకు గుదిబండలా మారాయి. ఈ ప్రభుత్వమైన హమాలీలు చార్జీలు చెల్లించి రైతులపై అదనపు భారం తగ్గించాలి. హమాలీ చార్జీలు ప్రభుత్వం చెల్లిస్తుందా లేదా అనే విషయంపై స్పష్టత ఇస్తే రైతులు వాటిపై ఆశలు వదులుకుంటారు.

– భాస్కర్, రైతు సంఘం మండల కార్యదర్శి, రేమద్దుల

రూ.వేలల్లో ఖర్చు



ప్రతి సీజన్‌లో హమాలీ చార్జీలు రూ.4 నుంచి రూ.5 వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. పెరిగిన ఎరువుల ధరలకు తోడు హమాలీ చార్జీల కారణంగా రైతుకు అదనపు భారం పడుతుంది. ఈ యాసంగిలో నాకు 191 బస్తాలు అయితే హమాలీ, సుతిలీ ఖర్చులు దాదాపుగా రూ.4 వేల వరకు ఖర్చయింది. హమాలీ చార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తే రైతులకు కొంత వరకు మేలు జరుగుతుంది. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి.

– లింగాల రాములు, రైతు, పాన్‌గల్

ఆదేశాలు రాలేదు



ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో హమాలీ ఛార్జీల విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. గతంలో మాదిరిగానే ప్రస్తుతం కూడా రైతులే భరిస్తున్నారు. హమాలీ చార్జీల విషయంలో ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందితే దానిపై రైతులకు తెలియపరుస్తాం.

– భాస్కర్‌గౌడు, సింగిల్ విండో, సీఈఓ పాన్‌గల్

‘మున్సిపాలిటీకి ఆదాయం అవసరం లేదా’



శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తి టౌన్: మున్సిపాలిటీకి చికెన్ వ్యర్థాల టెండర్ ద్వారా రావాల్సిన ఆదాయాన్ని ఎందుకు రాబట్టడం లేదని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డిని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు రవియాదవ్, మాజీ కౌన్సిలర్ కృష్ణబాబు, బొంబాయి మన్నెంకొండ తదితరులతో కలిసి మంగళవారం పుర కార్యాలయంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డితో మాట్లాడారు. గత కాంగ్రెస్ కౌన్సిల్‌లో 8 నెలల కాల పరిమితికి రూ. 29 లక్షల పైచిలుకు చికెన్, మటన్, చేపల వ్యర్థాలకు టెండర్ నిర్వహించారని, వాటిలో కేవలం రూ.10లక్షలు వసూలు చేసి మిగతావి సమయం మించిపోయిన ఎందుకు రాబట్టడం లేదని ప్రశ్నించారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. టెండర్ దారుడు డబ్బులు కట్టలేదని అతడి వాహనాన్ని మున్సిపల్ కార్యాలయంలో నెల రోజులు ఉంచుకొని ఏ నిబంధనల ప్రకారం చెప్పాపెట్టకుండా పంపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీకి ఆదాయం సమకూరాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే మేఘారెడ్డి గత కౌన్సిల్‌లో పారదర్శకంగా టెండర్ నిర్వహించేందుకు పాలకవర్గానికి ఆదేశాలు ఇచ్చారని, అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టినా డబ్బులు రికవరీ చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. తదుపరి చర్యల కోసం టెండర్ దారుడిపై ఆర్‌ఆర్ యాక్ట్ ప్రయోగించాలని కలెక్టర్‌కు పంపామని చెప్పడంతో అందుకు సంబంధించిన పత్రాలు ఎక్కడున్నాయని వారు అడిగారు. పత్రాలు గురించి కమిషనర్‌తో మాట్లాడాలని అధికారి సూచించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో మంగళవారం నిర్వహించాల్సిన కోళ్ల వ్యర్థాల టెండర్ ప్రక్రియ రద్దు చేశామని, మరోమారు దీనికి సంబంధించిన ప్రకటన విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

కార్మిక చట్టాలు పునరుద్ధరించాలి

వనపర్తి రూరల్: ఆశావర్కర్లను కార్మిక చట్టాల పరిధిలోకి తేవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని ఆశావర్కర్లు పాల్గొంటారని తెలియజేస్తూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాయంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్లకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు నిర్ణయించాలని కోరారు. 45, 46వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సుల ప్రకారం ఆశావర్కర్లకు పెన్షన్, ఇతర సామాజిక భద్రత ప్రయోజనాలను కల్పించాలన్నారు. వారికి మూడో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. వేతనంతో కూడిన ప్రసూతి, 20 రోజుల సాధారణ, వేతనంతో కూడిన మెడికల్ సెలవులు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సునీత, మహేశ్వరి, అనిత, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమరులైన కార్మికుల స్ఫూర్తితో పోరాటం



మాట్లాడుతున్న రమేష్

వనపర్తి రూరల్: 8 గంటల పనిదినం కోసం చేసిన పోరాటంలో అమరులైన కార్మికుల స్ఫూర్తితో, కేంద్రం హరించి వేస్తున్న కార్మికుల హక్కుల కోసం పోరాటం కొనసాగించాలని సీపీఐ వనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో చంద్రయ్య అధ్యక్షతన నియోజకవర్గ ముఖ్య నేతలతో మే డే సన్నాహ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 1న ప్రతి గ్రామం, పట్టణం, కార్మిక వాడ, సీపీఐ శాఖ ఆధ్వర్యంలో ఎర్ర జెండాలను ఎగురవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, ఎర్ర కుర్మయ్య, శాంతమూర్తి, నరసింహ పాల్గొన్నారు.

బృహత్ వనం మొక్కలు వాడుముఖం



అమరచింత: మండలానికో బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసి మొక్కలు సంరక్షించే చర్యలు తీసుకున్నా అధికారులు ప్రస్తుతం వాటి సంరక్షణకు చర్యలు తీసుకోలేకపోతున్నారు. దీంతో నాటిన పది వేల మొక్కలు ఎండుముఖం పడుతున్నాయి. మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు క్యాంపు సమీపంలో నాలుగేళ్ల కిందట ఏర్పాటు చేసిన బృహత్ పల్లె ప్రకృతి వనంలో పదివేల మొక్కలు నాటి వాటిని సంరక్షించారు. ప్రస్తుతం ఈజీఎస్ ద్వారా నిర్వహణ గడువు పూర్తవ్వడంతో పంచాయతీకి సంరక్షణ బాధ్యతలు అప్పగించారు. రోజువారి మొక్కలకు నీటిని అందించలేకపోవడంతో అవి ఎండుపుల్లలుగా దర్శనమిస్తున్నాయి. వీటితో పాటు సంపద వనాల పరిస్థితి సైతం అదే విధంగా తయారయింది.

మెగా పార్క్ నుంచి యథేచ్ఛగా మట్టి తరలింపు



పార్క్‌లో మట్టి తవ్వుతున్న పొక్లెయిన్

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లి మెగా పార్క్‌లో మంగళవారం జేసీబీలను పెట్టి ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా మట్టి తరలిస్తున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీసులు అధికారులు తమకు ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. సామాన్యులు తమ ఇంటి అవసరాల నిమిత్తం మట్టి, ఇసుక తరలించే వారిని పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇబ్బందులు సృష్టిస్తూ ఆయా వాహనాలను పట్టుకొని జరిమానా విధిస్తున్నా.. ఆ నిబంధనలు అక్రమార్కులకు వర్తించవా అన్ని ప్రశ్నిస్తున్నారు. ఆయా అధికారుల అండతోనే అక్రమార్కులు మట్టి తరలిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. పార్కులో ఏకంగా కొందరు వ్యక్తులు జేసీబీలను పెట్టి మట్టిని తవ్వి బయట అమ్ముకుంటూ ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగిస్తుంటే అధికారులకు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. మట్టి తరలిస్తున్న ప్రాంతానికి పోలీసులు, రెవెన్యూ అధికారులు వెళ్లి అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా జేసీబీలు, ట్రాక్టర్లను వదిలిపెట్టి ఇక నుంచి మట్టి తరలించొద్దని సూచించి వదిలేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా పలుమార్లు పార్క్ నుంచి మొర్రం తరలిస్తున్న అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి తరలిపోకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్ఐ తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి మహేష్‌గౌడ్‌ను వివరణ కోరగా ఎలాంటి అనుమతులు లేకుండా పార్క్ నుంచి మట్టి తరలించడం వాస్తవమేనని, తమకు సమాచారం రావడంతో మట్టి తరలించకుండా నిలిపివేసినట్లు వారు పేర్కొన్నారు.

‘బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి’

వనపర్తి రూరల్: బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలని మండల ఇన్‌చార్జ్ ఎం రాఘవేందర్‌గౌడ్ కార్యకర్తలకు సూచించారు. బీజేపీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ అధ్యక్షతన మంగళవారం శ్రీరంగాపురం మండలంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు అనేక మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు ఏ ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేక పోయిందని విమర్శించారు. స్థానిక సంస్థల పాలన కాలం ముగిసి ఏడాదిన్నర దాటుతున్నా ఇంతవరకు ఎన్నికల ఊసే ఎత్తడం లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో రాముడు, జాని, శివ, రాజేష్, ఎల్లస్వామి, నరేష్, కావలి రాము, ఉపేందర్, చరణ్ పాల్గొన్నారు.

పనుల నాణ్యత పరిశీలన



పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లి గ్రామంలో కేంద్ర జలశక్తి అభియాన్‌లో రూ.5.30 లక్షలతో చేపట్టిన పందికుంట ఎంఐ ట్యాంకు మరమ్మతు పనులను మంగళవారం జలశక్తి అభియాన్ నోడల్ అధికారి సుధీర్‌కుమార్ మండల స్థాయి ఉపాధి అధికారులతో కలిసి పరిశీలించారు. అభియాన్‌లో చేపట్టిన మరమ్మతు పనులు నాణ్యతగా ఉన్నాయా, మరమ్మతుతో నీటి నిల్వలు, పరిసరాల్లో భూగర్భ జలాల పెరుగుదల వంటి అంశాల గురించి ఆరా తీశారు. ఆయన వెంట ఏపీఓ కుర్మయ్య, ఈసీ అంజన్‌రెడ్డి, టీఏ సునీత, పంచాయతీ కార్యదర్శి నీలమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ సోమ్లనాయక్, రైతులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు, వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేసి అద్దాలు అందజేస్తున్న అల్లూరి శ్రీనివాస్‌చౌదరి

కొత్తకోట రూరల్: మండలంలోని నాటవెల్లి శివారులో గల మానవత విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో మంగళవారం పామాపురం, నాటవెల్లి గ్రామాల్లో కంటి పరీక్షలు, వైద్య శిబిరం నిర్వహించినట్లు మానవత విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడు అల్లూరి శ్రీనివాస్‌చౌదరి తెలిపారు. కంటి పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి అద్దాలు ఉచితంగా ఇవ్వడంతో పాటు ఆరోగ్య పరీక్షలు చేసుకున్న వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌చౌదరి మాట్లాడుతూ పిల్లలందరికీ మంచి ఆరోగ్యం, ఉత్తమ సంస్కారం ఇవ్వడం మనందరి బాధ్యత అని, మానవతా సంస్కార విద్యలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమష్టి కృషి చేస్తేనే మెరుగైన లక్ష్యం చేరుకుంటామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ రాంబాబు, డాక్టర్ లక్ష్మణ్, హోమియో డాక్టర్ వీరభద్రరావు, వలంటీర్లు దూరయ్, తులసి, ప్రియాంక, ఉషారాణి, జిజ్ఞాస్ తదితరులు ఉన్నారు.

వ్యర్థాలు పారబోస్తే కఠిన చర్యలు

- చెరువు వద్ద సీసీ కెమెరాలు, ఫ్లెక్సీల ఏర్పాటు
- కమిషనర్ శశిధర్

సాక్షి ఎఫెక్ట్..



చెరువు వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేయిస్తున్న కమిషనర్ శశిధర్

ఆత్మకూర్: పట్టణ శివారులోని పరమేశ్వరస్వామి చెరువులో కోళ్లు, గొర్రెల వ్యర్థాలు పారవేయడంతో దుర్వాసన వెదజల్లుతోందని మంగళవారం సాక్షి దిన పత్రికలో ‘కాలుష్య కోరల్లో పరమేశ్వరుడి చెరువు’ శీర్షిక కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. పురపాలిక కమిషనర్ చికెనె శశిధర్ బృందం చెరువును సందర్శించి పరిసరాలను పరిశీలించారు. వెంటనే సీసీ కెమెరాలు, అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు. చెరువు ప్రాంతం మొత్తం సీసీటీవీ పర్యవేక్షణలో ఉందని, ఈ ప్రదేశంలో ఎలాంటి వ్యర్థ పదార్థాలు వేసినా రూ.10 వేలు జరిమానా విధిస్తామని ఫ్లెక్సీల్లో హెచ్చరిక ఏర్పాటు చేశారు. స్థానికులు, చికెన్, మటన్ వ్యాపారులు గమనించి వ్యర్థాలు పారబోయకుండా చెరువును కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

నిబంధనల మేరకే లబ్ధిదారుల ఎంపిక



ఆగారంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలు తెలుసుకుంటున్న ప్రత్యేక అధికారి



పాన్‌గల్ మండలం మల్లాయిపల్లిలో..

పాన్‌గల్: గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇచ్చిన లబ్ధిదారుల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులను ఎంపిక చేస్తామని ఎంపీడీఓ గోవింద్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని కదిరెపాడులో లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకున్న వారికే బిల్లులు మంజూరు అవుతాయన్నారు.

ఖిల్లాఘనపురం: రాష్ట్ర ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారమే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక చేపడతామని ఆగారం గ్రామ ప్రత్యేక అధికారి నరేష్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆగారంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల వివరాలను ప్రత్యక్షంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మున్నూరు జయకర్, గ్రామస్తులు కృష్ణయ్య, శంకరమ్మ, బాలుచందర్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పితే అంతే..



మూలమళ్ల-అమరచింత రహదారిలో వంతెన దుస్థితి

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వపై నిర్మించిన వంతెన పిట్టగోడలు దెబ్బతింటున్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోంటాయో అన్న భయంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వంతెన దాటేస్తున్నారు. మండలంలోని అమరచింత నుంచి మూలమళ్లకు వెళ్తున్న కచ్చారహదారిపై ఎడమ కాల్వ దాటేందుకు ఇరు గ్రామాల ప్రజల రాకపోకల కోసం వంతెన నిర్మించారు. ప్రస్తుతం వంతెన పిట్టగోడలు దెబ్బతినడంతో అవి విరిగి పడుతున్నాయి. వంతెనపై ద్విచక్రవాహనాలతో పాటు ఇతర వాహనాలపై వెళ్తున్న ప్రజలు వీటిని గమనించకుండా వెళితే కాల్వలో వారి వాహనాలు పడిపోవడం ఖాయమంటున్నారు. ఇప్పటికైనా పీజేపీ అధికారులు స్పందించి వంతెనల మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ఐసీడీఎస్‌కు నష్టం కలిగించొద్దు



మాట్లాడుతున్న బొబ్బిలి నిక్సన్

కొత్తకోట: ఐసీడీఎస్‌కు నష్టం కలిగించే చర్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆయాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐసీడీఎస్ ప్రారంభమై నేటికి 50 ఏళ్లు గడుస్తుందని.. సంస్థాగతం చేయాలని సుప్రీం కోర్టు, కాగ్ నివేదిక, యూనిసెఫ్ తదితర జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో పాటు 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ కూడా నిర్ణయించిందని పేర్కొన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ప్రాధాన్యతను గుర్తించడం లేదని.. ఈ స్కీమ్‌ను పూర్తిగా వదిలేసుకునే ప్రయత్నం చేస్తోందని, ప్రైవేటీకరణలో భాగంగా ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేస్తూ ఎస్‌ఈసీ చట్టాన్ని తెచ్చిందని తెలిపారు. ఐసీడీఎస్ నిర్వహణలో కేవలం 60 శాతం మాత్రమే రాష్ట్రాలకు చెల్లిస్తుందని.. దేశంలో ఆకలి, పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, గౌరవప్రదమైన వేతనాలు లేకపోవడం, రక్తహీనత, పోషకాహార లోపం తీవ్రమవుతున్న దశలో ఐసీడీఎస్ సేవలు మరింత అవసరమని పేర్కొన్నారు. మే నెలలో అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ఇవ్వాలని కోరుతూ సీడీపీఓ రామలక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు వనజకుమారి, వెంకటేశ్వరమ్మ, సావిత్రి, ప్రసన్న, విజయలక్ష్మి, పార్వతి, సుజాతమ్మ, విక్టోరియా పాల్గొన్నారు.

పరామర్శ

చిన్నంబావి: మండలంలోని లక్ష్మీపల్లికి చెందిన దొడ్డి ఈశ్వరయ్య అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణప్రసాద్ యాదవ్ ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాస్కర్ యాదవ్, రవిగౌడు తదితరులు పాల్గొన్నారు.

‘అపూర్వ’ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–1999వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం మండల కేంద్రంలోని కేఎస్‌ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించారు. దాదాపుగా 27 ఏళ్ల తర్వాత కలుసుకున్న చిన్ననాటి స్నేహితులు గురువులను అప్యాయంగా పలుకరించుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రస్తుత కుటుంబ నేపథ్యం, చేస్తున్న ఉద్యోగాలు, వ్యాపారాలపై చర్చించుకున్నారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురువులు దామోదర్‌రెడ్డి, పుల్లారెడ్డి, సూర్యనారాయణ, యాకూబ్‌అలీ, నారాయణరెడ్డి, భద్రసేనయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.